# పాకిస్థాన్

[కథానిక]

✽

= శ్రీ బి. వెంకటరావు =

"మీర్జా—"

"నోరు మూసుకో. ఆట్టే వాక్కు. నీమాత్రం నాకు తెలియదేం?" అన్నాడు మీర్జా కత్తి ఛాతిమీద నూరుతూ. తళతళలాడే ఆ కత్తి చేతిమీద పెట్టి పదునుచూచాడు. మళ్లీ నూరుతున్నాడు. నునుపు చాల్లేదు కాబోలు.

"ప్రేమతో సాధించేకార్యం కరకు కత్తితో సాధించగలవా? భ్రమ. కత్తి కాదు పదునుపెట్టవలసింది, మనస్సు!"

"భ్రమ? నీకా, నాకా? కత్తితో సాధించలేంది వుందా? నా తడాఖా చూద్దుగాని రెండురోజుల్లో. ఒహాల్లకింద లొంగివుండటానికి మెవళ్లనుకొన్నావు? ఈశరీరంలో ప్రవహించేది ముస్లింరక్తం." అంటూ మెరిసే కత్తిని గాలిలో ఒక్కమారు త్రిప్పాడు మీర్జా.

జీనా గజగజా వణికింది. జలజలా కన్నీరు కార్చింది. మీర్జా రెండుచేతులూ పట్టుకొని ప్రార్థించింది. "మీర్జా, మతమనే పేరుతో నీవు చేసే మారణహోమానికి అర్థం వుందా? ఎందరు మానవులు నిష్కారణంగా యీ నీకత్తికి ఆహుతిఅవుతారో వూహించావా? నీవు చేయబోయే ఈకార్యంవల్ల యిస్లాంమతం దేశదేశాల్లో ఎంత అపఖ్యాతి పొందుతుందో గ్రహించావా? వివిధరంగుల అద్దాల్లోంచి ప్రసరించే ఒకే సూర్యకాంతి వేరువేరు రంగులలో గోచరించినట్లు యీ అనంతవిశ్వంలో ఒకే లక్ష్యం వివిధజాతులలో వివిధమతాలుగా ప్రబలింది."

"ఈ నీ మెట్టవేదాంతం కట్టిపెట్టు. ఇస్లాం మతానికి ఆపద రానున్నది. హిందూదేశంలోని ముస్లిములను నామరూపాలు లేకుండా నాశనంచేయాలని చూస్తున్నారు. ఒకప్పుడు కత్తితో స్థాపించిన మొగలు సామ్రాజ్యం మళ్లీ కత్తితోనే పునరుద్ధరించాలి" అన్నాడు మీర్జా ఆవేశంతో.

"కాలంతోపాటు భావాలూ, భావాలతోపాటు మానవులూ మారాలి. ఒకప్పుడు కత్తితో సాధించినది యీనాడు ప్రేమతో సాధించాలి. హిందూముస్లిములు భాయీ

ఖాయీగా ప్రవర్తించాలి. తమ విరోధిని గుర్తించి కార్యం సాధించాలి"అన్నది జీనా.

"ఒకవైపు హిందువులు బ్రిటిషువాళ్లతో చేరి మన నాశనాన్ని కోరుతూ మన పాకిస్థానుకు అడ్డుతగులుతుంటే వాళ్లతో ఖాయీ ఖాయీగా తిరగాలా, వారినికత్తితో కయిమా చేయాలా" అంటూ మీర్జా వికటంగా నవ్వాడు కత్తి చూస్తూ.

"మీర్జా! ఒకేయింటిలో నివసించే వాళ్లు కత్తి నాధారంచేసుకొని ఎన్నాళ్లు జీవించగలరు? మనం హిందువుల వాడలో నివసిస్తున్నాం. నాకు చాలా భయంగా వుంది. నీవు చేసే పనులు యిక్కడివాళ్లు పసికట్టారుకూడాను. నీవు యిల్లువదలి వెళ్ల వద్దు" అంటూ బతిమాలింది జీనా.

"ఈ బొందిలో ప్రాణం వుండగా ఎవడు నిన్ను ముట్టగలడు"అన్నాడు మీర్జా చెదిరి పోయిన జుట్టు సర్దుకొంటూ.

ఇంతలో ఎవరో మనిషి వచ్చాడు. సన్నంగానూ లేడు, లావుగానూ లేడు. మధ్యరకం. కళ్లు ఎఱ్ఱగా వున్నాయి. లుంగీ కట్టాడు పెద్దపెద్ద చారలది. అతన్ని చూచి మీర్జా ముందుకువెళ్లి కలుసుకొని ఏదో గుసగుసలాడాడు జీనాకు వినబడకుండా. తిరిగివచ్చి, "జీనా, అన్నం పెట్టు. ఆకలవు తుంది"అన్నాడు. గబగబా రెండుమెతుకులు నోట్లో వేసుకొని బయలుదేరాడు.

* * *

పదిగంటలు దాటింది. ఆకాశంమీద నల్లని కారుమబ్బులు తెల్లగా చక్కగా కిలకిలలాడే రిక్కలను కప్పుకొంటూ పరు గెడుతున్నాయి.

ఇక్కడ యీపృథ్విపై నున్న షహాజ హాన్‌పురంలో జనం ఒకవీధిలోంచి మరొక వీధిలోనికి పరుగిడుతున్నారు. కత్తులతోను, కర్రలతోను కొందరు వీరవిహారం చేస్తు న్నారు. భీతావహంతో ప్రాణాలు గుప్పిటపట్టి పరుగిడుతున్నవారిని పట్టి 'అన్నా-అన్నా' అని యెంత అర్థించినా విడవకుండా చావ మోదారు. కొందరు లాఠీలు చేతపట్టి విగత వస్త్రులయిన స్త్రీలను యిండ్లనుండి బయటకు నెడుతూవుంటే, వీథులలో నున్నవాళ్లు ఆ స్త్రీలను చూచి పకపకా నవ్వుతున్నారు. పసిపాపలు కేరుకేరుమని ఏడుస్తున్నారు. ఒక మూలనుంచి యిండ్లు తగులబడుటచే వెదుళ్లు ఫెళ్లుఫెళ్లుమని ప్రేలుతున్నాయి. మధ్యమధ్య 'అల్లాహో అక్బర్'-'జిన్నా జిందాబాద్'అనే కేకలు. కొందరు 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూంటే కొందరు 'హిందుస్తాన్ మురదా బాద్'అని అరుస్తున్నారు. ఆరోజున వీథులు రక్తంతో తడిశాయి. మృత్యువు వేయినాలు కలతో ఈపృథ్విని నరవాసన లేకుండా నాకేసేటట్లువుంది.

ఇంతలో ప్రక్కవీథిలోంచి ఒక స్త్రీ భయంతో గజగజా వణకుతూ పరుగెత్తు తూంది. ఆమె ఒక పాకిస్తాన్ఆరాధకుని దృష్టిలో పడింది. వెంటనే 'పాకిస్తాన్ జిందా బాద్'అని పెద్దకేక వేస్తూ ఆమెవెంటపడ్డారు. ఆమె వేయి క్రూరమృగాలచే తరుమబడే హరిణివలె హడలిపోతూ పరుగిడుతుంది. నిమిషనిమిషానికీ గుంపు దగ్గరవుతూ వచ్చింది. ఆమె దగ్గరే పగలగొట్టబడిన ఒక చీకటి కొట్టులో దూరింది. భయంతో ఒకమూల గోడకు అంటుకుపోయింది.

• గుంపు కొట్టుదగ్గరకు వచ్చి 'అల్లాహో అక్బర్'అని పెద్దగా నినాదం చేసింది.

గుంపులోంచి ఒకడు కత్తిదూసుకొంటూ కొట్టులోకి దుమికాడు. భయంతో నోట మాట రాక కంపిస్తూవున్న నిస్సహాయమైన ఆస్త్రీని కత్తితో ఒక్కవేటు వేశాడు. ఆ దెబ్బతో ఆప్రాణి 'అల్లా' అంటూ క్రింద పడింది.

"జీనా !"

"మీ...ర్జా!"

"జీనా—నీకు యీగతి—నా చేతులతో నీప్రాణాలు పుచ్చుకొన్నా"అంటూ మీర్జా రక్తసిక్తమయిన తన చేతులతో జీనాతల తన తొడలమీద పెట్టుకొన్నాడు.

దెబ్బతిన్న జీనా 'అల్లా' అని అరవగానే బయట గుంపులోనివాళ్లు ఒకరిని ఒకరు చూసుకొంటూ నిశ్శబ్దంగా నిలబడ్డారు.

"మీర్జా, యిప్పటికైనా అనుభవానికి వచ్చిందా ? మతావేశంలో నీస్త్రీనే నీవు చంపుకొన్నావే. ఈ నీ చేతుల్లో ఎందర పసిపాపల రక్తం పేరుకొందో ! ఎన్ని ప్రాణాలు నీకత్తికి ఎరఅయినవో. అబ్బా! ఉష్-నరాలు పీక్కుపోతున్నాయి"అంటూ మీర్జాఒడిలో అటునుంచి యిటు ఒరిగింది జీనా.

"జీనా, యిలా ఎందుకు పరుగెత్తుకొని వచ్చావు ?"అన్నాడు మీర్జా దీనంగా.

"మీరు చేస్తున్న దౌర్జన్యానికి మన వీథిలోని హిందువులు రగులుకొని అల్లరులు చేయడం మొదలుపెట్టారు. నాకు అక్కడ వుండటం ప్రాణాపాయంగా తోచి యిట్లా పరుగెత్తుకొనివస్తున్నా-అబ్బా-బా. ధ. మీ-ర్జా-ఒక్క--కో-రి-క..."

"జీనా, చెప్పు"అన్నట్లు మీర్జా ఆమె ముఖం నిమిరాడు.

"మీర్జా- పా-కి-స్తా-న్-పేరుతో- అపవిత్ర-కార్యాలు-వ-ద్దు"

అంటూ జీనా తన పతిచేతుల్లో ప్రాణాలు వదిలింది.



'పారిస్ కార్నర్'-మద్రాసు.